నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 26 మార్చి 2023

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-బిచ్కుంద

కళాశాల బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవ పథకం యూనిట్ 1, యూనిట్ 2 సభ్యులు మాన్యపూర్, సీతారంపల్లి గ్రామాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవను పెంపొందించాలనే ఉద్దేశంతో సేవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలు పంచుకునేటట్లు ప్రోత్సహించడానికి క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాన్యపూర్ గ్రామ సర్పంచ్ రాములు, సీతారాం పల్లి గ్రామ సర్పంచ్ గంగారెడ్డి, గ్రామ కార్యదర్శులు మనోజ్, షోహెబ్, ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమ అధికారులు సంజీవరెడ్డి ,డా. జీ. వెంకటేశం, వాలంటీర్లు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల్ భుయాన్ కు జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్, జిల్లా జడ్జి శ్రీదేవి, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల్ భుయాన్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.


జస్టిస్ భుయాన్‌కు పుష్పగుచ్ఛ అందజేస్తున్న కలెక్టర్

'జన చైతన్య'కు బ్రహ్మరథం

- ఉమ్మడి జిల్లాలో సీపీఐ(ఎం) యాత్ర సక్సెస్
- కేంద్ర వైఫల్యాలు ఎండగట్టిన నేతలు
- పసుపు రైతుల అవస్థలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


వీక్లి రౌండప్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర ఉమ్మడి జిల్లాలో సక్సెస్ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలనతో పాటు మతోన్మాద విధానాలను ఆ పార్టీ నాయకులు ఎండగట్టారు. ముఖ్యంగా కేంద్రంలోని మోడీ సర్కారు కార్పొరేట్లకు ఏ విధంగా కొమ్ముకాస్తుందో వివరించే ప్రయత్నం చేశారు. ఇక జన చైతన్య యాత్ర సక్సెస్ కావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 29వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే బహిరంగ సభకు ఇరు జిల్లాల నుంచి పెద్దఎత్తున జన సమీకరణ చేపట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

కేంద్రంలోని మోడీ సర్కారు అవలంబిస్తున్న విధానాలను ప్రజలకు చైతన్యం చేసేందుకు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ జనచైతన్య యాత్రలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలో మూడు జాతాలను ప్రారంభించారు. శనివారం మూడో జాతా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యింది. ఈ జాతాకు పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ హాజరయ్యారు. యాత్రలో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బైక్ ర్యాలీ చేపట్టారు. అయితే నాయకులు ప్రధానంగా కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యవసర ధరలు ఏ విధంగా ఆకాశాన్నంటుతున్నాయి? మత విద్వేషాలతో ఏ విధంగా పబ్బం గడుపుకుంటున్నారు? మోడీ తన కార్పొరేట్ మిత్రులకు దేశ సంపదను ఏ విధంగా దోచిపెడుతున్నారో వివరించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా అదానీకి ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి ఎల్ఐసీ నుంచి నిధుల మళ్లింపు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక బైక్ ర్యాలీలో కార్యకర్తలు ఎరుపు రంగ టీషర్టులు, టోపీలు ధరించి పాల్గొనడం ఆకర్షించింది.

పసుపు రైతుల పరేషాన్...

పసుపు రైతుల కష్టాలు కొనసాగుతున్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు ధర గరిష్టంగా రూ.7500 కూడా దాటని పరిస్థితి నెలకొంది. కేవలం ఒకరిద్దరికి రూ.7300 పలికిన ధర.. మెజార్టీ రైతులకు రూ.4500 నుంచి రూ.6000 వరకు మాత్రమే ధర వస్తోంది. దీంతో రైతులు అయోమయంలో పడుతు న్నారు. నిల్వ చేసేందుకు స్థలం లేక వ్యాపారులు అడిగిన ధరకు పంటను అమ్ముకుంటు న్నారు.

ఊపిరి పీల్చుకున్న బీఆర్ఎస్ శ్రేణులు..

లిక్కర్ స్కాంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో కవితను అరెస్టు చేయకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి. ఈడీ పలుమార్లు విచారణకు పిలవడంతో కేంద్రంలోని మోడీ సర్కారు.. దర్యాప్తు సంస్థను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ సర్కారును ఇబ్బందుల పాల్జేసేందుకు యత్నిస్తుందని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే సత్తా లేక ఆయన కుమార్తెను లిక్కర్ స్కాంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈడీ ఇప్పటి వరకు మూడు సార్లు కవితను విచారించింది. పలుమార్లు గంటల తరబడి విచారించింది. అయితే రెండోసారి విచారణ సమయంలో కవితను అరెస్టు చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. పార్టీ నాయకులు సైతం నిజామాబాద్ నుంచి కూడా కవితకు మద్దతుగా ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. అయితే పలుమార్లు విచారించిన ఈడీ అధికారులు.. కేవలం ప్రశ్నించి వదిలేయడంతో నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు, కార్యకర్తలు

విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని గద్దెదించండి

- జనచైతన యాత్రలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాగర్

నవతెలంగాణ-భిక్కనూర్

విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపిని గద్దె దించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ అన్నారు. పార్టీ చేపట్టిన జనచైతన్య యాత్ర శనివారం ఉదయం భిక్కనూర్ మండల కేంద్రానికి చేరుకుంది. యాత్ర రథసారథి జాన్‌వెస్లీతో పాటు నాయకులకు పూలమాలలు వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్యన చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతోందని, ఇలాంటి పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రమ, ఆర్ వెంకట్ రాములు, సోమయ్య, రవి, విజయ్, జోన్ కార్యదర్శి కొత్త నర్సింలు, జిల్లా కార్యదర్శి వెంకట్‌రాములు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, అరుణ్, మధుర, నాయక్, రాజనర్సు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పీఆర్‌సీ కమిటీ వేయాలి

- గొడుగులతో పెన్షనర్ల ధర్నా


గొడుగులు పట్టుకొని ధర్నా చేస్తున్న పెన్షనర్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు గోడుగులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా పి.ఆర్.సి. కాల పరిమితి ముగిసినందున జూన్ 2023 నుండి అమలయ్యే విధంగా కొత్త పిఆర్సి కమిటీ నియమించాలని, బకాయి ఉన్న 3 డి ఏ లను విడుదల చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును పటిష్ట పరిచి, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు ,కార్పోరేట్ ఆసుపత్రులలో అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ పెన్షనర్లకు నెలకు రూ.9000/- రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన పెన్షనర్లు గొడుగులతో కొత్త కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్రావు, ప్రధాన కార్యదర్శి ఎస్ మదన్ మోహన్, జిల్లా నాయకులు సుదర్శన్ రాజు, ఈవిఎల్ నారాయణ, ముత్తారం నరసింహస్వామి, ఎం.జార్జ్, హనుమాన్లు, ప్రసాద్ రావు, లావు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై ఎంపీ ఆరా


స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ బీబీపాటిల్

నవతెలంగాణ-మద్నూర్

మూడు రాష్ట్రాల సరిహద్దులు గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులతో ప్రజాప్రతినిధులతో సరదాగా ముచ్చటించారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించిన దాదాపు 7 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల అడిగి తెలుసుకున్నారు. ఎంపీ ఆలయ సందర్శనాన్ని తెలుసుకున్న బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మండల ప్రజా ప్రతినిధులు సలాబత్పూర్ సందర్శించి ఎంపీని కవాలిరు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, మద్నూర్ గ్రామ సర్పంచ్ విట్టల్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్, కేలూర్ ఎంపిటిసి విజయ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, సొసైటీ మాజీ చైర్మన్లు తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామ మల్లారెడ్డి చెరువులో శనివారం మత్స్యకారులకు జిల్లా మత్స్యశాఖ అధికారి వరదా రెడ్డి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 57 మందికి గానూ 40 మందికి వృత్తి నైపుణ్యత పరీక్షలో అర్హత సాధించారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యశాఖ రెండో విడత మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వృత్తి నైపుణ్య పరీక్షల్లో భాగంగా వల విసురుడు, ఈత కొట్టడం, పాండి గుంజుడు, తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ నివేదికలను రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్, జిల్లా మత్స్యశాఖ సిబ్బంది శ్వేత, సురేష్, కెమెరామెన్ ప్రసాద్, స్థానిక ఉప సర్పంచ్ గోనె.శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో అభివృద్ధి

- గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల అధికారుల చొరవ ప్రశంసనీయం
- జిల్లా జడ్పీ చైర్మన్ ద ఫెదర్ శోభ, కలెక్టర్ జితేశ్‌వి పాటిల్
- ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డుల పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


పురస్కారం అందుకుంటున్న రామారెడ్డి మండలం స్కూల్ తండా సర్పంచ్ సలావత్ లలిత బుచ్చిరెడ్డి

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చూపిన చొరవ ప్రశంసనీయమని జెడ్పి చైర్ పర్సన్ శోభ అన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు పోటీతత్వంతో పని చేయాలని తెలిపారు. జాతీయ స్థాయి పంచాయతీ అవార్డ్ 2023 కు ఎంపికైన గ్రామాల సర్పంచ్‌లకు స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి అవార్డులు అందజేశారు. వారికి ప్రశంస పత్రాలు, సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి చైర్ పర్సన్ శోభ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్న కలెక్టర్ బృందానికి ధన్యవాదాలు చెప్పారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏపుగా పెరగడంతో అల్లాదకరమైన వాతావరణం కనిపిస్తుందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జాతీయ పంచాయతీ అవార్డుల కోసం జిల్లా నుంచి 525 గ్రామపంచాయతీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వాటిలో 27 పంచాయతీలు ఉత్తమ పంచాయతీ అవార్డులను సాధించినట్లు చెప్పారు. రాష్ట్రంలో అతి తక్కువ పోషకారాలోపంతో ఉన్న పిల్లలు జిల్లాలోని అంగన్వాడి కేంద్రాల్లో ఉన్నారని పేర్కొన్నారు. సర్పంచులు పోటీపడి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీలు సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని చెప్పారు. 27 గ్రామపంచాయతీలు జాతీయస్థాయి అవార్డులకు ఎంపికైనందున వారికి అవార్డులను, ప్రశంస పత్రాలను జడ్పీ చైర్పర్సన్ శోభ, కలెక్టర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారికి సన్మానం చేశారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జెడ్పి సీఈవో సాయ గౌడ్, డిపిఓ శ్రీనివాసరావు, అధికారులు, ఎంపీపీలు, జెడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ.. అందరి బాధ్యత

- జిల్లా జడ్జి శ్రీదేవి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

బాలికలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా జడ్జి శ్రీదేవి అన్నారు. కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో శనివారం ఫోక్స్, జెజె యాక్ట్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫోక్స్ కోర్ట్ ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. గ్రామస్థాయిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణ పై కళాజాత ప్రదర్శనలు నిర్వహిం చాలని తెలిపారు. బాలికలను వేధిస్తే చట్టం ప్రకారం పడే శిక్షణ గురించి వివరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ అపర్ణ, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ జడ్జి శ్రీనివాస్ నాయక్, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, సి డబ్ల్యూ సి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, కన్సల్టెంట్ డేవిడ్ రాజు, జిల్లా బాలల పరిరక్షణ అధికారిని స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మద్దెల చెరువు గ్రామంలో 16 లక్షల రూపాయలతో నిర్మించిన పల్లె దావఖాన హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం చిల్లర్గి సింగిల్ విండో పరిధిలోని రాంపూర్ హెడ్‌క్వార్టర్, మండల కేంద్రంలో అదనపు భవన నిర్మాణములకు రూ.13 లక్షలు, పిట్లం సింగిల్ విండో పరిపాలన భవనంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 60 లక్షలతో చేపట్టే పనులకు పోచారం భాస్కర్ రెడ్డి తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ శపథం రెడ్డి , సిబ్బంది ఇరువురిని ఘనంగా సన్మానించారు.

డబుల్ ఇండ్లు, దళితబంధు అందజేయాలి

మండలంలోని దళితులకు డబుల్ బెడ్ రూమ్, దళితబంధు అమలు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం బాన్సువాడ డివిజన్ ప్రధాన కార్యదర్శి గైని సురేష్ , రాచకొండ మొగులయ్య కోరారు. శనివారం మద్దెల చెరువు గ్రామంలో ఎమ్మెల్యే షిండేకు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధికి నోచుకోని దళితులందరికీ డబుల్ బెడ్ రూమ్‌లతో పాటు దళిత బంధు అందించాలని డిమాండ్ చేశారు. మద్దెల చెరువు గ్రామంలో దళితులకు రూ.10 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ చేయగలరని కోరారు.

చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, చెక్కులను ఎంపీపీ ప్రతాప్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ దేశాయ్ కలిసి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎ ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్‌ది అని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరమన్నారు. కార్యక్ర మంలో జెడ్పిటిసి చంద్రబాగ, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి ,సర్పంచ్ల మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

ఎల్లారెడ్డి తైబజార్ @ రూ.7.40 లక్షలు


వేలంపాటలో పాల్గొన్న ఔత్సాహికులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ అధ్యక్షతన తై బజార్ వేలం పాట నిర్వహించారు. వార సంతలో లక్ష రూపాయలు, డైలీ మార్కెట్ 75000 వేలు, పశువుల సంతకు 50,000 వేలుడిపాజిట్ చెల్లించి 17 మంది కాంట్రాక్టర్లు వేలం పాటలో పాల్గొన్నారు. ఈ వేలంపాటలో వారసంతను వెంకటరమణ 7లక్షల 40 వేలు, డైలీ మార్కెట్ సంత ను 5.లక్షల 50 వేలకు దక్కించుకున్నాడు. పశువుల మార్కెట్ సంతను విద్యాసాగర్ 1,65,000 వేలకు దక్కించుకున్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మేనేజర్ వాసంతి, కౌన్సిలర్లు కోఆప్షన్ నెంబర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక సేవ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాభావం కూడా కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్, దుర్కి గ్రామ సర్పంచ్ శ్యామల అన్నారు. శనివారం బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. సమాజ సేవ చేయడం విద్యార్థుల యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. వారం రోజుల పాటు గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు డాక్టర్ నారాయణ, హెచ్ ఎం చందర్, ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు వెంకటరావు, అంబయ్య, శంకర్రావు, సత్యనారాయణ, సుధాకర్ రెడ్డి, వినోషణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు

కుటుంబాన్ని ఆదుకుంటాం

నవతెలంగాణ-ధర్పల్లి


కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుని మృతి పార్టీకి తీరని లోటు అని, కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ ధర్పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తోట సుబ్బన్న నెల రోజుల క్రితం తన వ్యవసాయ బోరువద్ద అర్ధరాత్రి విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ పరంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని అన్నారు.

అలాగే తాళ్ళ నాగరాజు అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్ రాజ్, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్, ధర్మయ్య గారి రాజేందర్ రెడ్డి, తదితరులున్నారు.

శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మెంబర్

నవతెలంగాణ-రామారెడ్డి


చిత్రపటం అందజేత

మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మెంబర్ అపర్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారికి శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సి డబ్ల్యూ సి అధికారిని స్వర్ణలత, సిడిపిఓ సునంద, సూపర్వైజర్లు సుమతి, శివలక్ష్మి, ఆలయ పాలకవర్గ సభ్యులు రాజేందర్, ఆలయ పూజారులు శ్రీనివాస్ శర్మ, సిబ్బంది సురేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ గొంతునొక్కేందుకు బీజేపీ కుట్ర

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోధన్

పార్లమెంటులో అదానీ, అంబానీల లావాదేవీల సంబంధాలపై ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతు నొక్కడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిందని, ఇది దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇది దేశ చరిత్రలోనే బ్లాక్ డేగా ప్రకటిస్తూ ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే తప్ప ప్రజలకు శ్రేయస్కర విషయం కాదని అన్నారు. టౌన్ యూత్ ప్రెసిడెంట్ నవీన్, టౌన్ జనరల్ సెక్రెటరీ, విష్ణువర్ధన్, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించొద్దు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించొద్దని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో నిర్వహించనున్న సదస్సుకు నిజామాబాద్ జిల్లా మాల మహానాడు నాయకులు బయలుదేరారు. శనివారం డిచ్‌పల్లి హైవే రోడ్డు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి బయలుదేరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నీలగిరి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు తర్ల రమేష్, అశోక్ భాగ్యవన్, మిర్జాపూర్ సాయన్న, మహిళా అధ్యక్షురాలు మాధవి, నగర అధ్యక్ష కార్యదర్శులు ధనరాజ్, బట్టి గంగాధర్, డివిజన్ అధ్యక్షులు తలారి సాయన్న, రూరల్ అధ్యక్షులు రమేష్, జిల్లా నాయకులు కిరణ్, తేజ, బిట్టు శివ, రాజేందర్, లింగన్న, రామ్ చందర్, దయానంద్ సోలాకీ, విజయ్ కాంలే, దేవన్న, బాలయ్య బాలస్వామి, మోహన్, మేకల అశోక్, సూరపోశెట్టి, ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- సూచించిన ఐసీడీఎస్ అధికారులు
- పలు గ్రామాల్లో పోషణ పక్వాడ

నవతెలంగాణ-విలేకరుల బృందం

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. శనివారం పలు గ్రామాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు.

బోధన్ : పట్టణంలోని గాంధీనగర్ 13వ వార్డులో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కౌమార బాలికలకు సూపర్ వైజర్ రాధిక అవగాహనా సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి మిల్లెట్స్ తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికలు రక్తహీనతతో బాధపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మావందికలాన్‌లో..

మావందికలాన్ గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ జానకీ చిరుధాన్యాల ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆహార పదార్థాలు వండిన మహిళలకు సర్పంచ్ లక్ష్మయ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపిలక్ష్మీ వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, స్థానిక అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంటాఖుర్దు క్యాంపులో..



బోధన్ : మావందికలాన్ లో బహుమతులు అందిస్తున్న సర్పంచ్



ముప్కాల్ మండలంలో..

పెంటాఖుర్దు క్యాంపు గ్రామంలో బాల్య వివాహం నిలుపుదల చేసిన సందర్భంగా బాలికను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించడానికి సూపర్వైజర్ గంగావేణి బాలిక కుటుంబానికి కౌన్సెలింగ్ చేశారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలోని సబ్ సెంటర్లో కిశోర బాలికలకు, గర్భిణీలుకు, బాలింతలకు పోషణ పక్వాడాపై అవగాహన కల్పించినట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీలారాణి అని తెలిపారు. శనివారం సబ్ సెంటర్లో శనగ, ఉలవలు, కొర్రలు, జొన్నలు సజ్జల వంటి చిరుధాన్యాలు ప్రతిరోజు ఆహారంలో తీసుకుంటే ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని ఆమె సూచించారు. మండల కేంద్రంలోని రెండు మూడు అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో న్యూట్రీ గార్డెన్లను పెంచుకొని ఆకుకూరలు కాయగూరలను పండించుకోవాలన్నారు. ఎలాంటి రసాయన మందులు వాడకుండా పండించిన కూరగాయలను తీసుకున్నట్లయితే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ పై విషయాలపై ఎలాంటి అశ్రద్ధ చేయకుండా పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుజాత, సురేఖ, పద్మ, రజిత, రాజ్యలక్ష్మి, గర్భిణీ బాలింత మహిళలు పాల్గొన్నారు.

ముప్కాల్ : పోషణ పక్షం వారో త్సవాల సందర్భంగా రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (కిశోర బాలికల) నడుమ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినట్టు గుర్తుచేశారు. కిశోర బాలికలకు చిరుధాన్యాల విశిష్టతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల ఆహారంపై పూర్తి స్థాయిలో వివరించారు. చిరుధాన్యాల వల్ల శరీరంలో ఐరన్ స్థాయి పెరిగి, రక్తహీనత తగ్గుముఖం పడుతుందని అన్నారు. సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించిన జెడ్పీ చైర్మన్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిజామాబాద్ ఉమెన్స్ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నీరం, జడ్పీటీసీ కమల నరేష్, ఎంపీడీవో లింగం నాయక్, సర్పంచులు భరత్, సాయిరెడ్డి, మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు, ప్రిన్సిపాల్ భారతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

- వైద్య నిపుణులు వెంకటేష్

నవతెలంగాణ-రెంజల్

లింగ నిర్ధారణ నేరమని వైద్య నిపుణులు వెంకటేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు మండలాలలో వెయ్యి మంది పురుషులకు 918 మంది మహిళలు మాత్రమే ఉన్నారని తెలిపారు. దేశంలో 30 శాతం మంది అబార్షన్లు చేయించుకోవడం వల్ల బాలికల నిష్పత్తి గణనీయంగా తగ్గుతుందని, దీనిని నివారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. లింగనిష్పత్తిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు బేటి పడావో బేటి బచావో అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్, వైద్య అధికారిని ప్రమోదిత, హెచ్ఈవోలు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, పీహెచ్ఎన్ రాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఐకేపీ సిబ్బంది, అంగన్వాడీలు, గర్భిణీలు పాల్గొన్నారు.

బాలల భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని వడ్డెర కాలనీలో గల అంగన్వాడీ సెంటర్‌లో బాలల భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి, బాల్య వివాహాలు జరగకుండా విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లితండ్రులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల రక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ కౌన్సిలర్, కోర్టు బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు సంగీతా ఖాందేష్ హాజరై తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంగీత ఖాందేష్ మాట్లాడుతూ నేడు సమాజములో మహిళలు, బాలికలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి రక్షణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమములో అంగన్వాడీ టీచర్లు శోభ, సవిత, బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, నరేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పరీక్ష ఫైనల్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ







నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐఎన్‌టీఎస్ఓ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్) జాతీయ పరీక్ష ఫైనల్ ఫలితాల్లో తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 10,052 మంది విద్యార్థులు సత్తా చాటి తమ ప్రతిభ చాటారు. నిజామాబాద్-1 బ్రాంచి నుంచి 176 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 150 మంది విద్యార్థులు వివిధ రకాల బహుమతులు సాధించారు. వీరిలో మొదటి బహుమతి 7వ తరగతికి చెందిన వేదాంత్ సుందర్ సాయి, 3వ బహుమతి 6వ తరగతికి చెందిన ఎం.సహస్ర, నాలుగవ బహుమతి 5వ తరగతికి చెందిన నాగుల శ్రీ చరణ్ కన్సోలేషన్ బహుమతులు-30మంది విద్యార్థులు, గోల్డ్‌మెడల్స్-28 మంది విద్యార్థులు, స్పెషల్ బహుమతులు-4, మెరిట్ సర్టిఫికెట్స్-84 మంది విద్యార్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ అభినందిస్తూ తమ పాఠశాలల్లో పోటీ పరీక్షలలో గెలుపొందే విధంగా కార్యాచరణ రూపొందించడం, దానిని అనుసరిస్తూ పాఠ్యాంశాలు బోధించడం వలన ఇటువంటి అద్భుత ఫలితాలు సాధించగలిగామన్నారు. డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో అనుసరిస్తున్న పాఠ్యప్రణాళిక ద్వారానే ఇటువంటి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జోన్ డీజీఎం జీ లక్ష్మణరావు, ఆర్ఐ రాజు, ప్రిన్సిపాల్ ప్రవీణ, కోఆర్డినేటర్లు నరేంద్ర, రజిని కుమారి, డీన్ వెంకటేష్, అకాడమిక్ ఇన్చార్జులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

- ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఏ మూలన చూసినా గుంతలు ఉండకుండా రాహదరుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని ఇందల్‌వాయి-భీమ్‌గల్ రహదారి పున్ణరుద్ధరణ, అభివృద్ధికి సంబంధించిన పనులకు గాను శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇందల్వాయి నుంచి భీంగల్ వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని ఉద్దేశ్యంతో ప్రత్యేక తీసుకొని రోడ్డు పునరుద్ధరణ కోసం రూ.మూడు కోట్ల 98 లక్షలు, అభివృద్ధికి ఏడు కోట్ల 20 లక్షల రూపాయలను మంజూరు అయ్యా యని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరి షత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, జెడ్పీటీసీ గడ్డం సుమన రవిరెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కార్యకర్తలే పార్టీకి పునాది

కార్యకర్తలే పార్టీకి పునాది అని.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తుందని అన్నారు. శనివా రం ఇందల్‌వాయి మండలం సంస్థాన్ సిర్నాపల్లి గ్రా మంలో బీఆర్ఎస్ మండల స్థాయి పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్‌ను చూసి బీజేపీలో భయం మొదలైందని, అందుకే మంత్రుల నుంచి ఎంపీల వరకు అందరిపై ఈడీ, సీబీఐ దాడుల పర్వం కొన సాగిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని దు య్యబట్టారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయాలన్నారు.

మూడు గ్రామాలకు జాతీయ అవార్డులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో బాగేపల్లి, దూపల్లి, కందకుర్తి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన సర్పంచులు, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శులకు కలిపి అవార్డులను శనివారం అందజేశారు. బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలుతో పాటు ఎంపీటీసీ గంగలతా భూమేష్, దూపల్లి సర్పంచ్ శనిగరం సాయిరెడ్డితో పాటు, ఎంపీటీసీ మొగులాబాయి, గ్రామ కార్యదర్శి సీహెచ్ సాయి, కందకుర్తి సర్పంచ్ మీర్జా కలీం బేగ్, ఎంపీటీసీ అసాద్‌బేగ్, గ్రామ కార్యదర్శి నవీన్, ఉప సర్పంచ్‌లకు, ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో గౌస్‌ద్దీన్, ఏపీఎం చిన్నయ్య, పశువైద్యాధికారి డాక్టర్ విట్టల్, ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీలారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ తదితరులున్నారు.



ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు సన్మానం

అర్హులకు అందని అవార్డులు.. సర్పంచ్‌ల ఆగ్రహం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అభివృద్ధికి పాటుపడిన సర్పంచులకు నిరాశ మిగిలిందని రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, రైతు సమన్వయ కమిటీ మండలాధ్యక్షులు కాశం సాయిలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే బృందాలను కేవలం రెండు మూడు గ్రామాలకు మాత్రమే పంపి సర్వే జరిపారని, అర్హులైన వారికి ఎలాంటి ప్రయోజనం లేకుండా చేశారని వారు ఎంపీడీవో శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవార్డుల సమావేశం నుంచి వారు బయటకు వెళ్లారు. 29 అంశాలకు సంబంధించిన సర్వే బృందాలు ఎక్కడెక్కడ సర్వే జరిపారో తెలపాలని వారు అధికారులను నిలదీశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకే ఈ ఎంపిక జరిగిందని, ఈ ఎంపికకు తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంపీడీవో శంకర్ వారికి నచ్చచెప్పారు. అధికారులు తూతూ మంత్రంగా సర్వేలు జరిపి అర్హులైన వారికి అవార్డులు రాకుండా చేశారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పల్లె అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, గ్రామాల అభివృద్ధికి తమ సేవలను అందించిన ప్రయోజనం లేకపోయిందని వారు వాపోయారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- చిరు వ్యాపార రంగాలలో రాణించాలి
- ఐకేపీ డీపీఎం నీలిమా

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాలలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల, శ్రీనిధి, గ్రామ సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను క్రమంగా చెల్లించి ఆర్థిక పురోగతిని సాధించాలని ఐకేపీ బ్యాంక్ లింకేజ్ డీపీఎం నీలిమా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఎడపల్లి ఇందిరా క్రాంతి పతం (ఐకేపీ) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఆజాదికా అమృత్ మహెూత్సవ, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్డీఏ పీడీ చందర్ నాయక్, ఎంపీపీ కె.శ్రీనివాస్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, స్థానిక సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్‌లతో పాటు పలువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజ్ డీపీఎం నీలిమ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు చిరు వ్యాపారాలు చేసుకోవాలని ఆమె అన్నారు. శ్రీనిధి గ్రామ సంఘం బ్యాంకు రుణాల లావాదేవీలపై ఆమె మహిళలకు పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం ఐకేపీ ఇన్సూరెన్స్ అధికారి మురళీమోహన్ మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు ఈ పథకంలో అనేక రకాల బీమా సౌకర్యాలు ఉన్నాయని ఆయన తెలిపారు. సురక్ష బీమా ఎంతో విలువైనన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలలో సభ్యులుగా నమోదు అయి ఉండాలన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే లబ్ధిదారులకు ప్రభుత్వ ద్వారా రుణాలు మంజూరవుతాయన్నారు. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ చాలామంది డ్వాక్రా మహిళలు రుణాలు పొంది చిరు వ్యాపారాలు నిర్వహించుకోవడం లేదన్నారు. ఇతర ఇంటి ఖర్చులకు మాత్రమే వాడుకుంటున్నారని వారు గుర్తు చేశారు. కెమెరా బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, మేఘన మాట్లాడారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న లక్ష రూపాయల రుణాలతో మహిళలు తమ కాళ్లమీద తావే నిలబడేటట్లు చిరు వ్యాపారాలు నిర్వహించాలన్నారు. అనంతరం అధికారులకు మహిళలకు గ్రామపంచాయతీ సమక్షంలో స్థానిక సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల శేఖర్, కెనరా బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు శ్రీనివాస్, మేఘన, ఎంపీటీసీలు మనిషారెడ్డి, నాయుడు స్రవంతి పోతన్న, వ్యవసాయ శాఖ అధికారి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ మేఘనను సన్మానిస్తున్న పలువురు

సింగంపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని సింగంపల్లి తాండ గ్రామంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ నిజామాబాద్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. సర్పంచ్ రాథోడ్ గంగాధర్, ఉప సర్పంచ్ శాంతాబాయి, ఎంపీటీసీ మీరాబాయి, గ్రామ కార్యదర్శి హరీష, కళాశాల ప్రిన్సిపల్ కే లావణ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.సరిత, ఎన్ఎస్ఎస్ మెంబర్స్ కె.అనిత, డి.మమత పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి పశువుల కాపరి మృతి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలోని గంగాసాగర్ చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మదారి శ్రీనివాస్ (30) మృతి చెందారు. స్థానిక ఎస్ఐ పండ్ల సాయన్న కథనం ప్రకారం.. మదారి శ్రీనివాస్ పశువులను మేపడానికి గంగాసాగర్ చెరువు కట్టపై వెళ్తూ ఉండగా ఆవులు చెరువులోకి వెళ్లడంతో వాటిని మళ్లించడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. భార్య మదారి మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రి తరలించారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాణిక్‌బండార్, అమ్రాద్ గ్రామాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని రైతులు తెలిపారు. రైతుల కథనం ప్రకారం.. అమ్రాద్ గ్రామ శివారు, మాణిక్ బండర్ గ్రామ శివారులో అలాగే మరోచోట ట్రాన్స్ ఫార్మర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశానని రైతులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అన్నారు.

నేడు ఘనపూర్‌లో విష్ణుమూర్తి జాతర

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని ఘనపూర్ గ్రామంలో గుట్టపై పురాతన కాలంనుంచి రాతి శిల్పంపై చెక్కబడి ఉన్న విష్ణు మూర్తికి దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం యజ్ఞం, పూజలు తదుపరి జాతర అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. జాతరకు చుట్టుపక్కల చిరు వ్యాపారులు, భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. జాతరకు చుట్టుపక్కల చిరు వ్యాపారులతో పాటు, ప్రజలు, భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని గ్రామపెద్దలు పేర్కొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో ఆయుష్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం యందు శనివారం పదవ తరగతి విద్యార్థులకు ఆయుష్ న్యూటిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ డి.ఎస్ రమణమోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని తగ్గించి ఉత్సాహంగా పరీక్షలు రాయడానికి శారీరక దృఢత్వానికి ప్రత్యేక ఆయుష్ కిట్లను అందజేయనున్నట్టు తెలిపారు. ఆయుష్ వైద్య విధానాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిని గంగామణి, ఉపాధ్యాయురాలు స్రవంతి, నవనీత, ఏఎన్ఎం విక్టోరియా, ఆయుష్ ఫార్మసిస్ట్ పురుషోత్తం, స్వరూప రాణి, పాల్‌రాజ్, సుచరిత, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం..

పట్టణంలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ భార్గవి, ఏసీటీపీఓ జ్యోతి మాట్లాడుతూ.. చిరుధాన్యాలను ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంలో భాగం చేసుకోవాలని, ప్రకృతిలో లభించే తాజా ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వలన పిల్లలు వయసుకు తగ్గ బరువు ఎత్తు ఉంటారని తెలిపారు ..ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు తార, సూపర్వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జానకంపేటలో హనుమాన్ స్వాముల శోభాయాత్ర

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామంలో హనుమాన్ దీక్ష స్వాములు హనుమాన్ మందిరం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పురవీధులలో శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వాములతోపాటు యువకులు చిన్నారులు సైతం శోభయాత్రలో పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల స్పెషల్ క్యాంప్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేశపూర్ మండలంలోని నిషిత కామర్స్ సైన్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సభకు ప్రత్యేక అతిథిగా తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. నిషిత కళాశాల వారు కేశపూర్‌ను దత్తత తీసుకొని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం మంచి విషయం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, ప్రిన్సిపాల్ జయంత్‌రెడ్డి, విలేజ్ కార్యదర్శి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం ఉదయం జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్ పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఈవోలు సర్వే నెంబర్ల వారీగా నమోదు చేపట్టిన పంటల వివరాలు సరైన రీతిలో ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల నమోదు ఆన్‌లైన్‌లో పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు రఘునాథన్ రాము శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశ్వం ఎడ్యుకేట్ తరఫునుంచి ఎంపికై శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బహుమతులు పొందినట్టు పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ ద్వితీయ బహుమతులు సాధించిన నిహారిక, మనోజ్ఞ, వర్షిని, అక్షర, షరిక్, భవిత్ బహుమతులు అందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లత, అబాకస్ ఉపాధ్యాయులు శ్రీలేఖ, రజిత తదితరులు పాల్గొన్నారు.

31న మద్నూర్ సింగిల్ విండో 52వ మహాజనసభ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ సింగిల్ విండో 52వ మహాజనసభ ఈనెల 31న శుక్రవారం ఉదయం 11:30 నిమిషాలకు సంఘం చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన జరుగుతుందని సంఘం కార్యదర్శి జే బాబురావు శనివారం ఒక ప్రకటనతో పేర్కొన్నారు. విండో పరిధిలోని రైతులు, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జమ, ఖర్చులను ఆమోదించడం, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. దీంతో పాటు అధ్యక్షుని అనుమతితో ఇతర అంశాలు చర్చించనున్నట్టు తెలిపారు. కావున రైతులు, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

తహశీల్దార్ ఎదుట బైండవర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ తహశీల్దార్ బావయ్య ఎదుట శనివారం ఒక్కరిని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 20న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నసురుల్లాబాద్ రాక సందర్భంగా బాన్సువాడ పట్టణం కు చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకోవడంతో నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చెయ్యడంతో తహశీల్దార్ ఎదుట బైండవర్ చేసినట్టు తెలిపారు. ఎలాంటి విభేదాలు మరోసారి జరగకుండా చూడాలని తహశీల్దార్ సూచించారు.

పల్లెలకు ఉత్తమ అవార్డులు

- వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరుకు పురస్కారం
- సర్పంచ్‌లకు, జీపీ కార్యదర్శులకు అవార్డులు అందజేసిన కలెక్టర్

నవతెలంగాణ-విలేకరులబృందం

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీలు ఉత్తమ పల్లెలుగా జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకున్నాయి. కామారెడ్డి జిల్లాలో 526 గ్రామపంచాయతీలకు గాను 27 గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామాలుగా ఎన్నికైయ్యాయి. కాగా ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, జీపీ కార్యదర్శులకు కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ ప్రజాప్రతినిధులు శనివారం జిల్లా కేంద్రంలో పురస్కారాలు అందజేశారు.

బిచ్కుంద : చైల్డ్‌ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో మండలంలోని వాజిద్‌నగర్ జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికైంది. కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ధపెదర్ శోభ రాజు చేతుల మీదుగా సర్పంచ్ తోట అనూహ్య లక్ష్మి నారాయణ, గ్రామ కార్యదర్శి రహేళ బేగం అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్రి సాయిలు, యం.పి.టి.సి బండికింద సాయిలు, ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో మహబూబ్, డాటా ఎంట్రీ ఆపరేటర్ శంకర్ ఉన్నారు.

ముచ్చటగా మూడో సారి..

మద్నూర్ : ఉత్తమ పనితీరుకు మద్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ ముచ్చటగా మూడో సారి ఉత్తమ పంచాయతీగా ఎంపికైటనట్టు ప్రజాప్రతినిధులు తెలిపారు. సర్పంచ్ సురేశ్ పురస్కారం అందుకున్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డుల కార్యక్రమంలో ఉపసర్పంచ్ విట్టల్, గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్, మండల అభివృద్ధి అధికారి రవిశ్వర్ గౌడ్, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య పాల్గొన్నారు.



బిచ్కుంద : అవార్డు అందుకున్న వాజిద్‌నగర్ సర్పంచ్



జుక్కల్ మండలం కేమ్రాజ్‌కల్లాలి..



అవార్డు అందుకున్న దోమకొండ సర్పంచ్

మూడు గ్రామాల ఎంపిక..

లింగంపేట్ : లింగంపేట మండలంలోని మూడు గ్రామ పంచాయతీలు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎన్నికైయ్యాయి. మండలంలోని మోతే, ఎక్కపల్లి, ఎల్లమ్మ గడ్డ తండా గ్రామ పచాయతీలు ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికయ్యాయి. జిల్లా కేంద్రంలో మోతే సర్పంచ్ ఏలేటి రామిరెడ్డి, ఎక్కపల్లి మాదాసు సతీష్ గౌడ్, ఎల్లమ్మ గడ్డ తండా ఇన్‌చార్జి సర్పంచ్ భీమ్‌రావు పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపిఓ ప్రభాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ తండాకు జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డు

రామారెడ్డి : మండలంలోని స్కూల్ తండా జీపీ జిల్లాస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుకు ఎంపికవ్వగా సర్పంచ్ సలావత్ లలితా బుచ్చిరెడ్డి అవార్డు అందుకున్నారు. సర్పంచ్‌ను శాలువాతో సన్మానించి, అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లలితా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. "పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనం" అంశంపై జిల్లా స్థాయిలో గ్రామపంచాయతీకి జిల్లాస్థాయిలో ప్రథమ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపిఓ సవితారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పిల్లి రాజేష్, పాల్గొన్నారు.

జుక్కల్ :మండలంలోని కేమ్రాజ్ కల్లాలి ఉత్తమ పంచాయతీగా ఎంపికైటనుట ఎంపీవో యాదగిరి తెలిపారు. కల్లాలీ సర్పంచ్ రమేష్ రావ్ దేశాయిని జిల్లా కలెక్టర్ వి జితేష్ పాటీల్ ప్రశంస పత్రంతో పాటు పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

దోమకొండకు అవార్డు

దోమకొండ : జాతీయ పంచాయతీ అవార్డుల ప్రోత్సాహలలో భాగంగా థీమ్ -6 స్వీయ - సమృద్ధమైన మౌలిక సదుపాయాల కల్పన పంచాయతీ విభాగంలో ప్రథమ అవార్డు దోమకొండ ఎంపికవ్వగా సర్పంచ్ నల్లపు అంజలికి పురస్కారం అందజేశారు. ఎంపిపి కానుగాంటి శారద,జడ్పీటిసి తిర్మల్ గౌడ్,దోమకొండ సర్పంచ్ పాలకవర్గానికి ,సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ లో గ్రామంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఎంపిటిసి నిమ్మ శంకర్, సదానంద, కో - ఆప్షన్ శామ్మి, డి పి ఓ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంపిఓ తిరుపతి వార్డు సభ్యులు రవి పంచాయతీ కార్యదర్శి సౌజన్య కిషన్ పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : మౌలిక సదుపాయాలు కల్పనలో మండలంలోని మీర్జాపూర్ గ్రామం ఎంపికవ్వగా సర్పంచ్ పురం లక్ష్మి వెంకట రమణ అవార్డు అందుకున్నారు. ఎంపిపి పాల్త్య విఠల్ మాట్లాడుతూ అవార్డు పొందిన గ్రామపంచాయతీ సర్పంచులకు ఆయన అభినందనలు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జున్ను బాయ్ ప్రతాప్ సింగ్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీఓ రాము గ్రామ సెక్రెటరీ రవి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మద్నూర్ సర్పంచ్



లింగంపేట్ : అవార్డులు అందుకున్న పలువురు సర్పంచ్‌లు



నసురుల్లాబాద్ : అవార్డు అందుకున్న మీర్జాపూర్ సర్పంచ్

రోడ్డు బాగు చేసుకున్న రైతులు

- పాలకులకు, అధికారులకు చెప్పి విసుగెత్తి చందాలు వేసుకున్న అన్నదాతలు



మట్టి రోడ్డు మరమ్మతులు చేయించుకున్న రైతులు

నవతెలంగాణ-జుక్కల్

పొలాలకు వెళ్లే రోడ్డును బాగు చేయాలని రైతులు పాలకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేరు. రోడ్డులేక ఎదురవుతున్న ఇబ్బందులు అంతా ఇంత కాదు. దీంతో రైతులంతా ఒక్కచోట చేరి చందాలు వేసుకొని రోడ్డును బాగు చేసుకున్నారు. మండలంలోని బస్వాపూర్ రైతులు తమ ఐక్యత చాటుకున్నారు. గ్రామంలోని బసవన్న చెరువు నుండి బంగారుపల్లి జీపీ సీమా (హద్దు) వరకు శివారులో రైతులు ఒక్కో ఎకరాకు రూ.వెయ్యి చొప్పున డబ్బులు పోగు చేసుకొని రోడ్డు మరమ్మతులు చేపట్టారు. జాతీయ ఉపాధి హామీలో రోడ్డు మంజూరు అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తామే ముందుకు వచ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఎంపీపీ నా రెడ్డి దశరథ్‌రెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ గ్రామాల బిఆర్ఎస్ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఘనంగా రథోత్సవం

రసవత్తరంగా కుస్తీ పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్



తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట్ మండల సమీపంలోని మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్ల వారుజామున రథోత్సవ కార్యక్రమాన్ని రంగ రంగ వైభవంగా చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం రాత్రి వరకు కుస్తీ పోటీలో ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. టెంకాయ కుస్తీ నుండి మొదలుకొని వెండి కడియాల వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర పాటు దూర ప్రాంతాలకు చెందిన బీదర్ నాందేడ్ హౌ రాజ్ దెగ్లూరు నారాయణఖేడ్, జహీరాబాద్, ఇతర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మకు ఎమ్మెలే పూజలు

మత్తడి పోచమ్మ అమ్మవారిని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ శుక్రవారం రాత్రి దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం వరకు రెండు కోట్ల నిధులతో రోడ్డు మంజూరు చేసినట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను చేపడతామన్నారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి, లింగంపేట్ సొసైటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, లింగంపేట్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ఆలయ కమిటీ అభివృద్ధి చైర్మన్ బొల్లారం సాయిలు నరహరి, తదితరులున్నారు

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గుండె పోటుతో మాజీ ఎంపిటిసి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ (32) కొంతకాలంగా హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో ఆసుపత్రి లోనే మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపారు.

కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

నవతెలంగాణ-జుక్కల్

కలిసి కట్టుగా గ్రామాన్ని ఆభివృద్ధి చేసుకుందామని సావర్‌గావ్ సర్పంచ్ కిషన్ అన్నారు. శనివారం గ్రామ సభ నిర్వహించినట్టు ఇంచార్జీ జేపిఎస్ సతీష్ తెలిపారు. సర్పంచ్ కిషన్ మాట్లాడుతూ మండలంలోని సావర్‌గావ్ గ్రామాన్ని ఆభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు గ్రామస్తుల సహకారం ఎంతైన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, జేపిఎస్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జిబాయి, సంధ్య, ఆశాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కురుమ కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



బాధిత కుటుంబీకులతో కులసభ్యులు

నిరు పేద కురుమ కుటుంబాలకు జిల్లా కురుమ సంఘం, యువజన సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా యువజన కురుమ సంఘం అధ్యక్షులు గణేష్ అన్నారు. నగరంలోని మిర్చి కాంపౌండ్‌లో నివసించే మాసం సురేష్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సురేష్ కూరగాయలు విక్రయిస్తుండేవాడు. సురేష్‌కు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇంటి పెద్ద కోల్పోయి వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కేశ వేణు సూచనల మేరకు జిల్లా కురుమ యువజన సంఘం అధ్యక్షులు గణేష్ వారి కుటుం బానికి ఆర్థిక సాయం అందజే సారు. శనివారం నగరంలోని మిర్చి కాంపౌండ్ లో సురేష్ కుటుంబానికి నిత్యవసర సరుకులు, నగదు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి తొండకూరు దేవన్న, కోశాధికారి చేగంటి గంగన్న, టౌన్ నాయకులు దుర్గాప్రసాద్ మాజీ కార్పొరేటర్ కేశ మహేష్, కేశ సుధాకర్, కురుమ యువజన కమిటీ భూమన్న, గంగాధర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమం

- ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలతో గోసపడ్డాం
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- కనపడకపోతే అభివృద్ధి చూపిస్తామని ప్రతిపక్షాలకు సవాల్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు.. తెలంగాణలో ఎక్కడి సమస్యలు అక్కడే. పట్టించు కొని పరిష్కరించే నాథుడే లేకుండే. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. మారుమూల నియోజకవర్గం జుక్కల్‌లో అనేక అభివృద్ధి పనులు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కొనసాగాయి. కావున మనమంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలని' ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. పెద్దకొడపగల్ మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ భారత దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణలో అభివృద్ధి జరిగిందని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు మరెక్కడా లేవని అన్నారు.

తెలంగాణ ఏర్పాటు అనంతరం పాలనలో ప్రజలకు సులభతరం కోసం జిల్లాలు, మండలాలను పునర్విభజన చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. పెద్ద గ్రామ పంచాయతీలో ఉన్న తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని పరిపాలన దగ్గరలోనే ఉండే విధంగా సీఎం కృషి చేసినట్టు తెలిపారు.

అంతే కాకుండా అప్పటి పెద్ద కొడపగల్ గ్రామ పంచాయతీ లో అంజనీ గ్రామానికి వెళ్లాలంటేనే జంకే పరిస్థితి కాంగ్రెస్ పాలనలో ఉండేదని, అప్పటి ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం కనీం రోడ్డు కూడా వేయించలేదని అన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో అంజనీ గ్రామానికి బీటీ రోడ్డు వేశామని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు అర్థం పర్థం లేకుండా అధికార పార్టీ పై నిందలు వేయడం మానుకోవాలని ఆయన ఆగ్రహ వ్యక్తం చేశారు. ఒక వేళ నిందలు చేస్తున్న ఇతర పార్టీల నాయకులకు అభివృద్ధి కంటికి కనపించకపోతే మా వెంట వస్తే ఏ గ్రామంలో ఏ ఏ అభివృద్ధి పనులు చేశామో చూపిస్తామని చురకలంటించారు. పెద్ద కొడపగల్ మండలంలో మొత్తం పింఛన్లు 2752 మంది లబ్ధిదారులకు అందజేశామని అప్పటి కాంగ్రెస్ పార్టీ అధికారంలో 200 రూపాయలు ఉన్న ఫించన్లు ప్రస్తుతం 2000 నుండి 3000 రూపాయలు అందిస్తున్న ఏకైక రాష్టం తెలంగాణ అని అన్నారు. అంతే కాకుండా రైతుబంధు కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు అందజేస్తున్నామని తెలిపారు. ఒక వేళ రైతు అకాల మరణం చేస్తే ఆ కుటుంబానికి ఆదుకోవడానికి రైతు భీమా ద్వారా ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు వారం రోజుల్లోనే అందిస్తున్న ఘనతను ఒక్క బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు కల్యాణ లక్ష్మి,షాది ముబారక్, ఆసరా పింఛన్లు, దళిత బంధు, రైతు భీమా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతు పెట్టుబడికోసం పెద్ద కొడపగల్ మండలా నికి 6379 రైతులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 14 కోట్లు వచ్చాయని మరియు రైతు భీమా ద్వారా 91 కుటుంబాలకు 4కోట్ల 55 లక్షలు అందించామని ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందిస్తున్న ఘనత బిఆర్ఎస్ పార్టీది అని అన్నారు. నాగమడగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడపగల్, బిచ్కుంద మండలకు నీళ్లు అందించే పనులు నడుస్తున్నాయని తెలిపారు.

నాగమడుగు ప్రాజెక్టుతో వడ్లం గ్రామ మునుగుతుందని వస్తున్న అపోహలను నమ్మొద్దని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో రెండు గుంటల భూమి ఇస్తే తాను స్వయంగా ఇల్లు కట్టుకొని ఇక్కడే ఉంటానని భరోసా కల్పించారు. పార్టీ నాయకులు అందరూ కలసిమెలసి ఉండి పార్టీ కోసం కష్ట పడి పని చెయ్యాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావ్ పటేల్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచ్ మండల ఫోరమ్ అధ్యక్షులు తిర్మల్‌రెడ్డి, మండల అధ్యక్షులు విజేయ్ దేశాయ్, జడ్పిటిసి చంద్ర భాగ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి/రామారెడ్డి/సదాశివనగర్



లింగంపేట్‌లో రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నియోజకవర్గం వ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించారు. లింగంపేట్ మండలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దివిటి రమేశ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 52 యూనిట్ల రక్తదానం చేసినట్టు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, వైస్ ఎంపీపీ విఠ్ఠల్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు నరేష్, సింగిల్ విండో చైర్మన్ దేవిందర్ రెడ్డి, వైస్ సర్పంచులు అనిల్ రెడ్డి, లక్ష్మి నారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ కేక్ ను కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్, నీలకంఠం, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శ్రావణ్ కుమార్, నునుగొండ శ్రీనివాస్, గాదె తిరుపతి, ఇమ్రాన్ సాజిద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని గొల్లపల్లిలో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలను శనివారం బి ఆర్ ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పాల మల్లేష్ మాట్లాడుతూ... అభివృద్ధి ధ్యేయంగా, ప్రతి గ్రామానికి నిధులు కేటాయిస్తూ, ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజా సమస్యలపై ప్రతినిత్యం పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల లావణ్య మల్లేష్,ఉప్ప సర్పంచ్ నర్సయ్య,గ్రామం అధ్యక్షులు రెడ్డి మల్లేష్, నరేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురెందర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో ని ప్రాథమిక పాఠశాలలో పిల్లల మధ్య న వేడుకలు నిర్వహించారు. కుప్రియాల్‌లో రామాలయంలో జడ్పీటీసీ కమిలి నర్సింలు, పార్టీ మండల అధ్యక్షులు బొలిపెల్లి మహేందర్ రెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి. రైతు బంధు అద్యక్షుడు భూంరెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీలో వార్డ్ మెంబర్ చేరిక

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలం ధర్మరావుపేట గ్రామ తొమ్మిదవ వార్డ్ మెంబర్ కరంకంటి నర్సింలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుభాష్ రెడ్డి చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలకు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్లో చేరినట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కోతి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

గంపగోవర్ధన్ పాలనతో

కామారెడ్డి అభివృద్ధి 15 ఏండ్లు వెనక్కు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్


ఎమ్మెల్యేగా గంపగోవర్ధన్ గెలిచిన తర్వాత కామారెడ్డి 15 సంవత్సరాలు వెనుకకు వెళ్ళిపోయిందని డీసీసీ అధ్యక్షులు శ్రీనివాసరావు ఆరోపించారు. సీఎం కేసీఆర్ సాక్షాత్తూ అసెంబ్లీలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పనితీరును మెచ్చుకున్నాడని, అందరికీ రోల్ మోడల్ అని కితాబు ఇచ్చినట్టు గుర్తుచేశారు. షబ్బీర్ అలీ హయాంలో తప్ప తర్వాత జరిగిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. కామారెడ్డిని అభివృద్ధి చేస్తావనుకుంటూ కమీషన్‌లతో విప్ అభివృద్ధి అయ్యాడని విమర్శించాడు. శుక్రవారం షబ్బీర్ అలీ పై గంప గోవర్ధన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బహిరంగ చర్చకు రమ్మని సవాలు విసురుతావు. దొంగల పారిపోతావ్ అని ఎద్దేవ చేశారు. గత ఎన్నికల సమయంలోనే గాంధీ విగ్రహం వద్ద చర్చకు సిద్ధమా అని మా నాయకుడు అక్కడికి వస్తే మా నాయకుడు వచ్చేలోపే పారిపోయరని ఆరోపించాడు.

చిరుధాన్యాల్లో పౌష్టికాహారం

నవతెలంగాణ-గాంధారి/మద్నూర్/జుక్కల్

గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చందా నాయక్ తండాలోని అంగన్వాడి కేంద్రంలో పోషక పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు కిషోర బాలికలకు చిరుధాన్యాల అవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ వినోదిని మాట్లాడుతూ బాలింతలు కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వాపూర్ సెక్టర్ అంగన్వాడి టీచర్లు గంగలత సునీత విజయ సంధ్య సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కొనసాగుతున్న పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు మద్నూర్ మండలంలోని చిన్న శక్కర్గ గ్రామపంచాయతీ పరిధిలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులు పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పోషణ లోపం లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ గఫర్, గ్రామ కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులు విజయ్, అంగన్వాడి టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.



గాంధారి మండలం మేడిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

జుక్కల్ : కౌమార దశలో ఉన్న బాలికలకు పౌష్టికాహరం తప్పక అందించాలని అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని పెద్ద గుల్లా అంగన్ వాడి 1, 2 సెంటర్‌ల టీచర్లు సునిత, లతాతాయి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో పౌష్టికాహారం మిల్లేట్, న్యూటీషియన్, మినుములు, పప్పుదినుసులుపైన కౌమారదశలో బాలికలకు అవగాహన కల్పించారు. పోషక ఆహారం పర్యవేక్షకులు ఆహర సమూహలు, ఆహర వైవిద్యం, పరిశుభ్రత పద్ధతులు వివరించారు.

వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తల్లిదండ్రుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 45వ తరగతి విద్యార్థులకు సొంత అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో చిరుధాన్యాలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోషక పక్షోత్సవాలను పురస్కరించుకుని చిరుధాన్యాలపైన అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, స్వరూప రాణి, పని శ్రీ, గౌతమి, ప్రవళిక, అంగన్వాడీ టీచర్లు నీరజ, సువార్త, కావేరి, ధనలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని కాల్పోల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయురాలు స్వప్న పరీక్షా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా జాగృతి రాష్ట్ర కార్యదర్శి నరాల సుధాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, వివేకానంద పాల్గొన్నారు.



సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు

ప్రజాస్వామ్యానికే ప్రమాదం..

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్

రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో, దేశాన్ని అభివృద్ధి చేయడంలో రాహుల్ గాంధీ కుటుంబం పాత్ర ఎంతో ఉందని, దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబంలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని, నీరవ్‌మోడీ, లలిత్ మోడీ భారతదేశ సంపదను దోచుకుని విదేశాలకు వెళితే దానిని ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై కేసు పెట్టడం సరైనది కాదని, బీజేపీ నాయకులు రాహుల్ గాంధీని పప్పు అని, సోనియాగాంధీని దేశ వాసి కాదని మాట్లాడితే తప్పులేదు కానీ దేశాన్ని దోచుకున్న వారి గురించి మాట్లాడితే కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. అదానీకి 12లక్షల కోట్ల ప్రజలధనాన్ని నరేంద్రమోడీ కట్టబెట్టాడని, పార్లమెంటులో మోడీకి, అదానీకి ఉన్న సంబంధం గురించి రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తే దానికి సమాధానం ఇవ్వలేదని, పార్లమెంటులో రాహుల్‌గాంధీపై అనర్హత వేయడం చాలా బాధాకరమని, దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని సుదర్శన్‌రెడ్డి తెలియజేశారు. ఎన్నికల సమయంలో జీరో అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాలో 15లక్షలు ఇస్తామని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి గెలిచారని ఇలాంటి తప్పుడు హామీలపై ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి..

బోధన్ : బోధన్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జహీర్ కుటుంబాన్ని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి శనివారం పరామర్శించారు. శుక్రవారం జహీర్ సోదరుని తల్లి మృతి చెందడంతో ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ ఇంచార్జి తాహెర్ బిన్ హందాన్, జిల్లా నాయకుడు గంగారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాషా మొహిద్దిన్, ఎడపల్లి మండల ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రామ్ మోహన్, పట్టణ ప్రధాన కార్యాదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి ఉన్నారు.

28న మహిళా అభ్యర్థులకు జాబ్‌మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాదు జిల్లాలోని మహిళా అభ్యర్థులకు ఈనెల తేదీ 28న నగరంలోని బాలికల ఐటీఐ నందు ఐటీసీ ఫుడ్ డివిజన్ మనోహరాబాద్ (మెదక్) వారి ఆధ్వర్యంలో వారిచే నిర్వహించనున్నట్టు బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ వి.లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ట్రైనింగ్ ఆపరేటర్ క్వాలిఫికేషన్ ఉద్యోగాలకు ఐటీఐ పాస్‌పోట్ ఉండి ఆల్ ట్రేడ్స్ కలిగి ఉండి 18 నుంచి 26 సంవత్సరాలోపు విద్యార్థినీలు అర్హులన్నారు. సుమారు మొత్తం 100 పోస్టులు ఉన్నాయని, వివరాలకు 886334579 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాగపూర్‌లో ధర్మశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో దాస ఆంజనేయ స్వామి గుడి వద్ద ధర్మశాల నిర్మాణానికి శనివారం పూజ చేశారు. ఆలయ అర్చకులు రమేష్ చంద్ర పంతులు ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్త బృందం, దాతల విరాళాలు సుమారు రూ.6లక్షలతో ఆంజనేయ స్వామి భక్తులు మాల ధారణ చేసుకున్నప్పుడు ఉండేందుకు వీలుగా ధర్మశాల నిర్మాణాన్ని చేపట్టినట్టు దశంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి.మహేష్, దశంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బసకొండ బాలమల్లేష్, క్రిష్ణ మల్లయ్య, గడ్డం నరేష్, సీహెచ్ విఠల్, నరసింహులు, శేఖర్, శ్రీకాంత్, అంజన్న మాలధారణ సభ్యులు లింబాద్రి, మధు, రవి, రాకేష్, పాలెపు రవి కిరణ్, భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురడిరెడ్డి ఫంక్షన్ హాల్‌కు రూ.4లక్షలు మంజూరు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో గురడిరెడ్డి ఫంక్షన్ హాల్ కొరకు ఎంపీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరైనట్టు బీజేపీ మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ తెలిపారు. ఈ మేరకు ఎంపీ ధర్మపురి అరవింద్ రూ.4లక్షల నిధులు మంజూరు చేస్తూ అందించిన ప్రొసిడింగ్ లెటర్‌ను శనివారం గురడిరెడ్డి సంఘం సభ్యులకు అందజేసినట్టు తెలిపారు. గురడిరెడ్డి ఫంక్షన్‌హాల్ కొరకు నిధులు మంజూరు చేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు, నిధుల మంజూరుకు సహకరించిన బాల్కొండ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డికి ఈ సందర్భంగా గురడి రెడ్డి సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు సంత లింగారెడ్డి, ఏనుగు రాజేశ్వర్, గడ్డం గణేష్, గడ్డం రాజేశ్వర్, దేవాయి రాజేశ్వర్, గడ్డం శ్రీధర్, బంగ్లా రమేష్, నలిమేల గంగాధర్, గడ్డం రవి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురుద్వార్‌ను సందర్శించిన సర్పంచులు, సొసైటీ చైర్మన్లు



గురుద్వార్ వద్ద సర్పంచ్‌లు, చైర్మెన్‌లు

నవతెలంగాణ-ఆర్మూర్

పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి నాందేడ్ సభకు ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం నాందేడ్ సభకు మండల సర్పంచ్‌లు నాందేడ్‌లో గల సిక్కుల ఆరాధ్య మందిరం గురుద్వార్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఆలూర్, పిప్రి, ఖానాపూర్, సుర్బిర్యాల్ సర్పంచులు కళ్లెం మోహన్ రెడ్డి, ఆసాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి మోహన్, సట్లపల్లి సవిత గణేష్, సొసైటీల చైర్మన్లు కళ్లెం భోజారెడ్డి, సోమ హేమంత్‌రెడ్డి, పెంట భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని సన్మానించారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ప్రభాకర్ డిమాండ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రంలో అర్హులైన పేద ప్రజలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సారా సురేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి, అనేక ఆకాంక్షలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదని అన్నారు. ముఖ్యంగా ఇల్లు లేని పేద ప్రజలందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ సంపూర్ణంగా నెరవేర్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. రెండు దఫాలు గెలిచిన కూడా లక్షలలో అర్హులు ఉంటే కనీసం వందలల్లో కూడా ఇండ్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను దగా చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యాబట్టారు. రాష్ట్రంలో 60 లక్షల మందికిపైగా వ్యవసాయ కార్మికులు గ్రామాల్లో పనులు లేక వలసలు వెళ్తుంటే చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేల జీవనభృతి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందని, వారికీ ఉద్యోగాలు ఇవ్వలేక యువతను గంజాయి, మద్యం మత్తులో ముంచుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ రెండో వారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు ప్రజాపంథా పార్టీ పిలుపునిచ్చిందన్నారు. సమావేశంలో ప్రజాపంథా జిల్లా నాయకులు బి.దేవరాం, పి.రామకృష్ణ, జి.కిషన్, ఎం.సత్యక్క, అశోక్, వి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.ప్రభాకర్

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత

నవతెలంగాణ-వర్ని

చిరుధాన్యాలతో ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత కిషోర్ బాలికలకు, తల్లులకు, పిల్లలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. చిరు ధాన్యాలు తింటే పిల్లలకు కలిగే సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సురేఖ, పద్మ, బాలికలు, బాలురు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మమత

సెంట్రల్ అగ్రికల్చర్ మీటింగ్‌లో ఏర్గట్ల యువరైత

నవతెలంగాణ-ఏర్గట్ల

సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ) వారు హైదరాబాద్‌లో ఈ నెల 23,24వ తేదీలలో నిర్వహించిన సమావేశానికి వివిధ జిల్లాల నుంచి జిల్లాకో రైతును ఎంపిక చేసి, రైతులకు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన యువరైతు పొత్కూరి మహేష్‌కు ఆహ్వానం రావడంతో ఆ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో రెండు రోజుల పాటు రైతులకు ఉపయోగపడే బెడ్ సిస్టం, మిషనరీ, స్ప్రేయర్ గురించి, నీటిని ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో శిక్షణ ఇచ్చారని, రైతులకు ఉపయోగపడే డ్రిప్ సిస్టం, రెయిన్ డ్రిప్, రెయిన్ గన్స్, గొర్రెలు, మేకల పెంపకం గురించి అవగాహన కల్పించినట్టు మహేష్ తెలిపారు. మీటింగ్ అనంతరం ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, క్రీడా డైరెక్టర్ కేవీ సింగ్ చేతుల మీదుగా తనకు సర్టిఫికెట్ అందించినట్టు తెలిపారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న రైతు మహేష్

బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మందర్న గ్రామంలో ఎస్బీఐ సాలూర బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాంకులు కల్పిస్తున్న సేవలపై అధికారులు రైతులకు శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా అందిస్తున్న పలు సేవలను రైతులతో సంధ్యా శిబిరం అనే కార్యక్రమం ద్వారా వివరించినట్టు తెలిపారు. రైతులు రుణమాఫీపై ఆధారపడి సమయం వృధా చేసుకోవద్దని, సకాలంలో క్రాప్‌లోన్‌లను రెన్యూవల్ చేసుకుని వడ్డీ రాయితీలు పొందాలని ఆయన సూచించారు. అలాగే ఓవర్ డ్యూ ఉన్న లోన్‌లను బ్యాంక్ వారి 'రింగ్ సమాధానం' స్కీమ్ పథకం కింద మార్చి 31వరకు సెటిల్ చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు బ్యాంక్ వారికి సహకరించి బ్యాంక్‌ను అభివృద్ధి చెందేలా సహకరించాలన్నారు.

కార్యక్రమంలో మంధర్నా సర్పంచ్ రావుబా గంగాధర్, హంసా సహకార సంఘం అధ్యక్షులు మంధర్నా రవి, డ్వాక్రా సంఘాల ప్రతినిధి రమేష్, గ్రామపెద్దలు రాజు పటేల్, ముప్పడి లక్ష్మణ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ హన్మంత్ పాటిల్, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ పాల్గొన్నారు.

పరీక్షలో మెళకువలు పాటించాలి

- ఏసీపీ కిరణ్
- పోలీస్ అభ్యర్థులకు నమూనా రాత పరీక్ష

నవతెలంగాణ-బోధన్

పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు రాత పరీక్షలో మెళుకువలు పాటించి ఉత్తీర్ణత సాధించాలని తద్వారా పోలీస్ ఉద్యోగంలో స్థిరపడాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నమూన రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. త్వరలో పోలీసు ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్ష సమర్థవంతంగా రాసి విజయం సాధించాలని సూచించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉద్యోగాల నోటిఫికేషన్లను నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే ఈ రాత పరీక్ష ద్వారా ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



నమూనా రాత పరీక్షపై అవగాహన

ఐఎఫ్‌టీయూ 9వ మహాసభలకు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మాక్లూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఈనెల 25, 26, 27 తేదీలలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దేశెట్టి రాధా పిలుపునిచ్చారు. శనివారం కార్మికులతో భారీ ప్రదర్శన ఊరేగింపు ఉంటుందని, సాయంత్రం నాలుగు గంటలకు కార్మిక ప్రదర్శన ఆరు గంటలకు ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ బహిరంగ సభకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ టి.శ్రీనివాస్, వక్తలుగా కామ్రేడ్ అపర్ణ ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారని దేశెట్టి రాధా తెలిపారు. ఈ బహిరంగ సభలో అరుణోదయ కళాకారులచే ఆటపాట మాట చిన్నారులచే నృత్యం నాట్యాలు ఉంటాయని అన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

- సీడీపీఓ జానకి



మాట్లాడుతున్న సీడీపీఓ జానకి

నవతెలంగాణ-కోటగిరి


బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని సీడీపీఓ జానకి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పేర్కొన్నారు. పోలీసుల సహకారం తీసుకొని బాలల పరిరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, బాలల సంరక్షణ అధికారి చైతన్య, డాక్టర్ సుప్రియ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు మనీ, సుమలత పాల్గొన్నారు.

మామిడిపల్లిలో 12 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

- అంబేద్కర్ జయంతిన ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి గ్రామ జాతీయ రహదారి పక్కన మాల, మాదిగ కుల సంఘాల ఆధ్వర్యంలో 12 అడుగుల ఎత్తు, ఆరు టన్నుల బరువు గల అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్టు అంబేద్కర్ కమిటీ నాయకులు పర్సా గణేష్, సుద్దపల్లి చిన్న గంగాధర్, సిరిపురం రాజన్న తెలిపారు. విగ్రహానికి మాజీ వార్డు సభ్యులు, డిచ్‌పల్లి దినేష్, విగ్రహ దాతగా వ్యవహరించారని వారు తెలిపారు.



ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం

గోల్డ్‌మెడల్ సాధించిన పూర్వ విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నరేంద్ర పాఠశాలలో 2015 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థిని అనుగు దేవికను పాఠశాల యాజమాన్యం పూలమాల శాలువాతో శనివారం ఘనంగా సత్కరించారు. 2021-22 జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ అసిలియేటెడ్ కళాశాల నుంచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రెండు గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని పాఠశాల వైస్ చైర్మన్ బద్దం లింగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోడె శ్రీనివాస్, ఉపాధ్యాయులు మాలెపు చంద్రయ్య, చరణ్, రాకేష్, పురుషోత్తం, రూపేష్ గీత, సంతోష, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ట్రాఫిక్ కానిస్టేబుళ్లు



సీపీకి పుష్పగుచ్చం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజును నిజామాబాద్ ట్రాఫిక్ కానిస్టేబుళ్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మాట్లాడుతూ.. నీతికి నిజాయితీకి మారుపేరుగా ఒక సంవత్సరం మూడు నెలల్లో నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి మంచి పేరును సంపాదించిన కె.ఆర్.నాగరాజుకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. అలాగే ఆయన అడుగుజాడల్లో ఆయన సూచనల మేరకు నడుచుకుంటామని ఈ సందర్భంగా వారు వివరించారు. మార్చి 31న విరమణ పొందుతున్న సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజును కలిసినందుకు సంతోషంగా ఉందన్నారు.